# సింగిల్ పేజీ కథలు

## పిరికివాడు

"ఏమ్మా! తొందరగా వచ్చేశారు" తలుపు తీస్తూ అడిగింది మాణిక్యం.

"తలనొప్పిగా ఉంది. హాఫ్‌డే లీవ్ పెట్టి వచ్చాను" జవాబిచ్చాను.

"భోజనం చేస్తారమ్మా!"

"భోజనం ఇప్పుడే వద్దు. స్ట్రాంగ్‌గా టీ పెట్టు. ముఖం కడుక్కుని వస్తాను" లోపలికి వెళ్లిపోయాను.

మాణిక్యం ఇచ్చిన టీ అందుకుంటూ "లెటర్స్ ఏమైనా వచ్చాయా" అడిగాను.

"రెండు ఉత్తరాలు వచ్చాయమ్మా! టేబుల్ మీద పెట్టాను. అయినా తలనొప్పి కదా! పడుకోండి" అంది ఆప్యాయంగా.

"ఇవి చదివి పడుకుంటానులే! నువ్వు భోజనం చెయ్యి" అని ఉత్తరాలు చేతిలో తీసుకున్నాను.

మొదటి ఉత్తరం థాంక్స్ చెపుతూ రాసింది. చదివి సంతోషపడ్డాను.

రెండవది మూడు పేజీల ఉత్తరం. ఎవరో అరుణ రాసింది. దీక్షగా చదవడం ప్రారంభించాను.

"భారతక్కా!

నమస్కారం. వీక్లీలో నువ్వు అందరి సమస్యలకు ఇచ్చే జవాబులు ఎంతో బాగుంటాయి. నేను నిన్ను అక్కగా భావిస్తూ ఇంట్లో ఎవరికీ చెప్పుకోలేని విషయాన్ని నీకు తెలియజేస్తున్నాను. దయచేసి ఈ చెల్లెలి బాధ అర్థం చేసుకొని నాకు పరిష్కారమార్గం చెపుతావని ఆశిస్తున్నాను.

మాది హన్మకొండ. నాన్నగారు బ్యాంకులో పనిచేస్తున్నారు. మేము ఇద్దరం అక్కాచెల్లెళ్లం, ఒక అన్నయ్య. అక్క మా బంధువుల అబ్బాయినే ప్రేమించింది. అతనితోనే పెళ్లి అయిపోయింది. మొదట్లో అక్కతో సమస్యను చెప్పుకునేదాన్ని. కానీ ప్రస్తుతం అక్క, బావ ఢిల్లీలో ఉంటున్నారు. అందుకే మీకు రాస్తున్నాను.

నేను కాలేజీలో చదివే టైంలో ఒక అబ్బాయిని ప్రేమించాను. ఆ అబ్బాయి పేరు హరి. అతను కూడా నన్ను చాలా ఇష్టపడ్డాడు. అతనిది మా కులం కాదు. అతనితో నాన్నగారు ససేమిరా పెళ్లి జరగనివ్వరు. అయినా నాకెంత ధైర్యం వచ్చిందో తెలియదు. అతని కోసం నాన్ననే కాదు ఎవరినైనా ఎదిరించగలనంత ధీమా ఉండేది. కాలేజీలో చాలామందికి మా ప్రేమ గురించి తెలుసు. ఫ్రెండ్స్ సహాయంతో మేము సిన్మాలకి, షికార్లకి వెళ్లే వాళ్లం.

ఈ విషయం అక్కకీ తెలిసింది. తను కూడా హరిని చూసి నా సెలక్షన్‌ని మెచ్చుకుంది. హరి అంతటి అందగాడు. మీ ఇద్దరి జోడి చాలా బాగుందని ఫ్రెండ్స్ కూడా అనే వాళ్లు. అక్క, నాన్న ఎలా రియాక్టు అవుతారోనని భయపడింది. కానీ నా మొండి ధైర్యం చూసి, నన్ను ఎంకరేజ్ చేసింది. సంవత్సరం అలా గడిచిపోయింది.

హరి డిగ్రీ అయ్యాక, బి.ఇడి ట్రైనింగ్‌కి వెళ్లిపోయాడు. మా ఇద్దరి మధ్యా తరుచూ సంభాషణలు జరిగేవి. కానీ క్రమేపీ తగ్గిపోయాయి. కొన్నాళ్లకు ఆగిపోయాయి. హరి ఊర్లోకి వచ్చినా నన్ను కలిసేవాడు కాదు. ఇంతలో నా డిగ్రీ పూర్తయింది. ఇంట్లో నా కోసం సంబంధాలు చూస్తున్నారు.

ఒకరోజు ఫ్రెండ్ ద్వారా హరితో డైరెక్టుగా కలిసి విషయమేమిటని అడిగాను. 'మన కులాలు వేరు. నేను పెద్దలను ఎదిరించలేను. సారీ' అన్నాడు.

'మరి ముందు కులాలు గుర్తు రాలేదా! నీ కోసం నేను అందరినీ వదులుకోడానికి సిద్ధపడ్డా'నని, చెడామడా తిట్టి వచ్చేశాను.ఆ కోపంలో మరుసటిరోజు వచ్చిన సంబంధాన్ని ఒప్పేసుకున్నాను. అయినా హరిని మర్చిపోలేకపోయాను. ఆడది తన మొదటి ప్రేమను మర్చిపోలేదంటారు కదక్కా! కానీ నేను నిస్సహాయురాల్ని. ఏం చెయ్యను.

నా పెళ్లి నరేష్‌తో అయిపోయింది. నరేష్ కాస్త నల్లగా, పొడవుగా ఉంటాడు. హరి అంతటి అందగాడు కాదు. అయినా నన్ను బాగానే చూసుకుంటాడు. ఏది కావాలన్నా తెస్తాడు. కానీ నాకే అసంతృప్తిగా ఉంటుంది. పెళ్లయి ఆర్నెల్లు అయింది. హరిని మర్చిపోయి ఇప్పుడిప్పుడే అతనితో కలిసి ఉంటున్నాను.

ఈ మధ్య దసరాకి అమ్మ వాళ్లింటికి వెళ్లాం. నరేష్ నాకిష్టమైన హీరో సిన్మా అని రెండు గంటలు క్యూలో ఉండి, అడ్వాన్స్ టికెట్స్ తెచ్చాడు. సాయంత్రం షోకి నరేష్, నేను సిన్మాకి వెళ్లాం. హాలు దగ్గర హరి కనిపించాడు. నా స్థితి మళ్లా మొదటికి వచ్చింది. నన్ను చూసి చాలా బాధపడ్డాడు. దగ్గరకొచ్చి సారీ అరుణా రేపు సాయంత్రం శివకోవెలకు రా! నీతో మాట్లాడాలి. ఐ రియల్లీ మిస్ యూ' అని చెప్పాడు. నరేష్ రావడంతో దూరంగా వెళ్లిపోయాడు. అది ఈయన గమనించలేదు.

హరి చూస్తుండగా నరేష్‌కి దగ్గరగా ఉండలేకపోయాను. అతనికి దూరంగా జరిగాను. హరి హాల్లో మా వెనకే కూర్చున్నాడు. నా వైపే అలా చూస్తూ ఉండిపోయాడు. నేను సిన్మా చూడలేకపోయాను. తలనొప్పిగా ఉందని నరేష్‌తో చెప్పి, ఇద్దరం ఇంటికి వచ్చేశాం. అన్నయ్య నన్ను తిట్టాడు. 'నీకు బుద్ధుందా! నీ కోసం అంతసేపు బావగారు క్యూలో ఉండి టికెట్లు తెస్తే నువ్వు చేసిన పనేంటో' అని కోప్పడ్డాడు.

కానీ ఆయన 'ఫోన్లే బావా! ఎంత బాగాలేదో ఏమో, లేదంటే తన ఫేవరేట్ సిన్మాని వదిలి వస్తుందా' అని సర్ది చెప్పారు.మర్నాడే ఆఫీసులో జాయిన్ అవ్వాలని నన్ను తీసుకొని వచ్చేశారు. మనసులో హరితో కలిసి మాట్లాడాలని ఉన్నా కుదరలేదు. ఆ రోజు నుండి నేను నరేష్‌తో సరిగ్గా ఉండలేకపోతున్నాను. అతను ఏది చేసినా నాకు చిరాగ్గా ఉంటుంది. హరి 'సరే' అంటే హరి దగ్గరకే వెళ్లిపోదామనిపిస్తుంది. మనిషొక చోట, మనసొక చోట ఉంది. ఇలా ఎన్నాళ్లు ఇష్టం లేని కాపురం చెయ్యగలను. దయచేసి అక్కా! నువ్వే నాకు మార్గం చూపించు. ఇష్టం లేని కాపురం చెయ్యలేను. హరి నన్ను ఇష్టపడుతున్నాడు. నేను అతని దగ్గరకే వెళ్లాలనుకుంటున్నాను. ఏం చేస్తే అతని దగ్గరకు చేరుకోగలను? నా బాధని అర్థం చేసుకొని జవాబు చెప్పవా! ప్లీజ్ అక్కా!

ఇట్లు

అరుణ"

ఉత్తరం మొత్తం చదివి భారంగా నిట్టూర్చాను. నా కళ్లలో నీళ్లు వచ్చాయి. గత స్మృతులు జ్ఞప్తికి వచ్చాయి. దీనికి జవాబు వీక్లీకి పంపకుండా అరుణ ఇంటికే రాయాలనుకున్నాను. పేపరు తీసి ఉత్తరం రాస్తుంటే, మాణిక్యం వచ్చింది.

"అమ్మా! పడుకోండమ్మా! తర్వాత రాసుకుందురు గానీ" అంది.

"లేదు మాణిక్యం! ఆలస్యం చేస్తే ఏం అనర్థం జరుగుతుందో. నేను ఉత్తరం రాసి ఇస్తాను. వెంటనే వెళ్లి పోస్టు చెయ్యి" అని గబగబా జవాబు రాశాను. మళ్లీ ఒకసారి మొదటి నుండి అంతా చదివి సంతృప్తి చెందాక కవర్‌లో పెట్టి అడ్రస్ రాసి మాణిక్యంకి ఇచ్చాను.

"చూడూ! మాణిక్యం! పోస్ట్‌బాక్స్‌ల్లో లెటర్సు ఇప్పుడు తీసేసి ఉంటారు. అందుకే నువ్వు తిన్నగా పోస్టాఫీస్‌కి వెళ్లి, ఇది పోస్ట్ చెయ్యి" అని చెప్పి కాస్సేపు కళ్లు మూసుకున్నాను. అయినా అరుణ గురించే ఆలోచిస్తున్నాను. పిచ్చి పిల్లా! ఏ నిర్ణయం తీసుకుంటుందో.. ఏమో

పది రోజులు గడిచిపోయాయి. ఒకరోజు వచ్చిన లెటర్స్‌లో అరుణ ఉత్తరం ఉంది. ఎంతో ఆత్రంగా తీసి చదివాను.

"ప్రియమైన భారతక్కకి,

నా ప్రేమపూర్వక నమస్కారములు. అక్కా నా బాధను అర్థం చేసుకొని, నాకు ప్రత్యేకంగా జవాబు రాశావు. నీ ఉత్తరం చదివే వరకు నేను నా భర్త గురించి అప్పుడు ఆలోచించలేదు. ఆవేశంలో, ఆకర్షణలో నేను తప్పటడుగు వేయబోయాను. నన్ను రక్షించావు. చాలా థాంక్స్ అక్కా!

ప్రేమని ధైర్యంగా వ్యక్తం చేయలేని వాడు, నిన్నెలా చేరదీస్తాడు. వాడొక పిరికివాడు, పిరికివాళ్లకు ప్రేమించే అర్హత లేదని నువ్వన్న దాంట్లో ఎంతో నిజముందక్కా! నిజమే.. హరి పిరికివాడు. కనీసం ఆడపిల్లనైనా నాకున్నంత ధైర్యం కూడా లేదు. కేవలం పై మెరుగులకి మోసపోయాను. అతని కంటే నా భర్తే ఎన్నో రెట్లు ఉత్తముడు. నన్ను ఎంతో అపురూపంగా చూసుకుంటున్నాడు. అతనికి అనుమానం వచ్చి, నా కాపురం ముక్కలవ్వకముందే నన్ను కాపాడవక్కా!

'మనం ప్రేమించిన వాళ్లని పొందే కంటే, మనల్ని ప్రేమించే వాళ్లని పొందడమే అదృష్టమన్నావు' ఇది అక్షరాలా నిజం. కంటికి రెప్పలా కాపాడుకునే భర్తను వదిలి, కంట్లో నలుసు కోసం వెంపర్లాడాను. నా భర్తకు ద్రోహం చేయబోయాను. అక్కా! సమయానికి నీ టానిక్ లాంటి ఉత్తరం నాకు అందడం వల్ల ఘోరం తప్పిపోయింది. ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చి, పిచ్చి ఆలోచన్లు పెట్టుకోను. నీ ఉత్తరాన్ని భద్రంగా దాచుకోవాలనుకున్నా. అది ఆయన కళ్లల్లో పెట్టుకోను. నీ ఉత్తరాన్ని భద్రంగా దాచుకోవాలనుకున్నా. అది ఆయన కళ్లల్లో పడితే ప్రమాదం. అందుకే దాన్ని ముక్కలు చేసి పారేశాను. కానీ, నువ్వు రాసిన ప్రతి అక్షరం నా మనసులో ముద్రితమైపోయింది. నీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఇట్లు
నీ చెల్లెలు
అరుణ"—

అంతా చదివిన నా ఆనందానికి అవధుల్లేవు. నా కళ్లల్లో ఆనందభాష్పాలు రాలాయి.

'నువ్వు చాలా అదృష్టవంతురాలివిరా అరుణా! నిన్ను హెచ్చరించడానికి అక్కలాంటి నేనున్నాను. ఇలాగే పదేళ్ల క్రితం నాకూ హెచ్చరించే అక్క ఉంటే నా జీవితం ఇలా ఉండేది కాదు. పిరికివాడ్ని నమ్ముకొని, అయిన వాళ్లందరినీ వదులుకొని, వచ్చి వెనక్కి వెళ్లలేక ఇలా ఏకాకిగా బ్రతకవలసి వచ్చేది కాదు' మనసులోనే నిట్టూర్చి మిగిలిన ఉత్తరాలు చదవడంలో నిమగ్నమయ్యాను.

**-'శ్యాం' (బొబ్బిలి)**

# కళ్లజోడు

"ఇంకొంచెం తొందరగా లేపచ్చును గదా! ఎంత సేపూ ఆ వంటింట్లో పడి కొట్టుకోవటమే కానీ ఇంకేమీ అక్కర్లేదు నీకు" విసుక్కుంటూ బాత్‌రూంలో దూరాడు కేశవరావు.

"నేనప్పటి నుంచీ లేపుతూనే ఉన్నాను. మీరు లేస్తేగా - లేస్తా... లేస్తా.. అంటూనే కునుకు తర్వాత కునుకు లాగించేస్తున్నారు దొరగారు. ఇంకేమవుతుంది?" తను కూడా విసుక్కుంటూ భర్తకి కావల్సినవి అమర్చసాగింది మాధవి.

ఒకపక్క నుంచి పిల్లలని స్కూలుకి పంపాలి. రెండో పక్క భర్తకి కావల్సినవి తెమల్చాలి. పిల్లలకి గబగబా బాక్సులు సర్ది, వాటర్ బాటిల్స్‌లో నీళ్లు పోస్తూండగా మళ్లీ దేనికో గావుకేక పెట్టాడు కేశవరావు. పరుగెత్తుకెళ్లి అతనిక్కావల్సినవి అందించి తిరిగి గబగబా వచ్చి కూతురికి జడవెయ్యసాగింది.

"జుట్టు అలా గుంజకమ్మా! మెడ నొప్పెడుతోంది!" అంటూ గారాలు పోతున్న కూతుర్ని "తొందరగా తెమలవే... అని ఇందాకట్నుంచీ మొత్తుకుంటూంటే ఇప్పుడు వచ్చావ్ జడవేయించుకుందుకు. ఎప్పటికప్పుడు అర్జెంటని ఈ చిక్కు తియ్యనివ్వవవు. కొన్నాళ్లు ఈ చిక్కు ఇలాగే మెయిన్టెయిన్ చేశావంటే సన్యాసి జుట్టులా అట్టలు కట్టేస్తుంది. అప్పుడు ఏకంగా గొరిగించటమొక్కటే ఇక శరణ్యమవుతుంది" మాధవి అంటున్న మాటలు-

"అమ్మా... పెన్నులో ఇంకు పోసి పెట్టమ్మా" అన్న బాబిగాడు అడుగుతున్న మాటల్లో కలిసిపోయాయి.

"ఈ హడావిడిలో అది కూడా ఎలా చెయ్యగలనురా బాబీ! ఇవేల్టికి బాల్ పెన్ పట్టుకెళ్లు నాయనా!" బతిమాలుతోంది మాధవి.

"మా టీచర్ ఊరుకోరమ్మా! ఇంకు పెన్నుతోనే రాయి. లేకపోతే ఫైన్ కట్టు.. అంటారమ్మా! ఫైన్ కట్టే స్థితి రాకూడదని అది అవమానకరమనీ నువ్వే చెప్పావుగదా... ఇదివరకు!" ఏనాడో తల్లి చెప్పిన నీతులు గుర్తుచేశాడు బాబి.

"నా నాయనే... జ్ఞాపకం వచ్చిందీ? నీవు చెప్పిన విద్యయే నీరజాక్షి - అని నా నీతి నాకే అప్పచెప్తున్నావన్న మాట" ముచ్చటగా కొడుకుని విసుక్కుంటూనే పెన్నులో ఇంకు నింపి ఇచ్చింది మాధవి.

ఇద్దరికీ ఇంక టిఫిన్స్ పెట్టాలి. పెట్టటం ఏమిటి? వాళ్లు సరిగ్గా తినరని తనే తినిపించేస్తూ ఉంటుంది మాధవి. అంత తొందరలోనూ కేశవరావుకి కావల్సినవన్నీ టేబుల్ మీద అమర్చేస్తుంటుంది రోజూ.

టిఫిన్, పెన్, సరిపడ డబ్బు పెట్టిన పర్స్, ష్యూస్, సాక్స్, కర్చీఫ్... వగైరాలన్నీను. అయినా దేనికో ఒకదానికి కేశవరావు మధూ...మధూ...అని అరుస్తూనే ఉంటాడు. అటు పిల్లల దగ్గరకీ, ఇటు భర్త దగ్గరికి పరుగులు పెడుతూనే ఉంటుంది మాధవి.

ఆవేళ కూడా రోజూలాగే అష్టావధానం చేస్తోందామె.

"మధూ... నా కళ్ళజోడు చూసిపెట్టు కొంచెం!" హుకుం జారీ చేసినట్లు అన్నాడు కేశవరావు.

"అక్కడే ఉంటుంది మహాశయా! చూసుకోండి కొంచెం. వీళ్లని ఆటో ఎక్కించేసి వస్తాను."

"ఇక్కడే ఉంటే నిన్నెందుకు అడుగుతానే? బొత్తిగా బుద్ధి ఉపయోగించవ్. ఏదో ఒకటి జవాబు చెప్పేయటమే గానీ...!" భార్యని గదురుకున్నాడు కేశవరావు.

పిల్లల్ని ఆటో ఎక్కించి వచ్చింది మాధవి. ఇంకా కళ్ళజోడు వెతుకుతూనే ఉన్నాడు కేశవరావు. తను కూడా ఒకటి, రెండు జాగాల్లో వెతికింది. ఈలోగా పనిమనిషి వచ్చింది. దానికి వెంటనే పని చూపించకపోతే ఇంకో ఇంట్లో పనికి వెళ్లిపోయిందంటే మధ్యాహ్నం వరకూ కనిపించదు మళ్లీను. తప్పనిసరై అటు వెళ్లింది మాధవి.

"ఏదీ పెట్టాల్సిన చోట పెట్టవు గదా? కళ్ళజోడు లేకపోతే నేను ఆఫీసులో పనెలా చెయ్యగలననుకున్నావ్? ఆమాత్రం బుద్ధి ఉండద్దూ?"

"నేనా టేబుల్ మీదే పెట్టాను. మీరే ఎక్కడో పెట్టేసుకుని మళ్లీ నన్నంటారేమిటి?" వెతకాల్సిన చోట్లన్నీ వెతికేస్తూ అంది మాధవి.

"ఎక్కడా లేదు. ఏమైపోయిందంటావ్? కొంపతీసి పోలేదు కదా?"

"పొదులెండి. పొద్దున్నే కాఫీ తాగుతూ పేపరు చూశారు గదా?"

"లేటుగా లేచానని కాఫీ కూడా తాగకుండా స్నానానికి వెళ్లిపోయాను. ఇంక పేపరేం చూశాను? అంతా నా ఖర్మ...!"

"ఒకవేళ ఆఫీసులో వదిలేయలేదు కదా? బాగా లేటుగా కూడా వచ్చారు. ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి!" పనిమనిషికి పాత్రలూ, అవీ వేస్తూనే భర్తతో మాట్లాడుతోంది మాధవి.

ఇద్దరూ తలోక పక్కనా నిర్విరామంగా వెతికేసి కళ్ళజోడు ఇంట్లో ఎక్కడా లేదని తేల్చేసుకున్నారు.

కూరగాయల బండి రావటంతో అటు వెడుతూ తాత్కాలికంగా ఒక చిన్న సూచన చేసింది మాధవి. "నెల్లాళ్లకిందే కదా... మీరు కొత్త కళ్ళజోడు కొన్నారు! ప్రస్తుతం పాత కళ్ళజోడుతో ఎలాగో ఇవేళ గడిపేయండి. బాబ్బాబూ! మీకు పుణ్యం ఉంటుంది. ఈలోగా ఇది కనుపించక పోదు" బతిమాలుతూ అంది మాధవి.

"నెల్లాళ్ల క్రితం ఎక్కడో దాచేసిన కళ్ళజోడు ఇప్పుడు ఈ అర్జెంట్‌లో తియ్యాలా?" విసుగొచ్చేసింది కేశవరావుకి.

"కొంచెం సేపు తన పక్కనే ఉండి తన అవసరాలు చూడకూడదు ఈ మాధవి? ఆ వంటింటి పనిలో పడిందంటే తన మొహంవైపు ఒక్కసారి కూడా చూడదు వెనుతిరిగి!" సన్నగా గొణుక్కుంటూ పాత కళ్ళజోడు బయటకి తీశాడు కేశవరావు. తడి చేతితో కళ్ళజోడు అద్దాలను తుడిచి మెత్తని గుడ్డతో క్లీన్ చేసి టేబుల్ మీద పెట్టబోతూ" అమ్మో... మళ్లీ ఇక్కడెక్కడో పెట్టి మర్చిపోయి, తిరిగి వెతకటం మొదలు... కళ్ళకే పెట్టేసుకోవడం మేలు కదా?

కళ్ళకి జోడు తగిలించుకోబోయాడు. కుదరటం లేదు. కళ్ళ దగ్గర ఏదో అడ్డమొస్తోంది. టక..టకమంటోంది ఏమిటో? నా కణతలు అంత గట్టిపడిపోయాయా? నిన్నటి వరకూ బాగానే ఉన్నాయే? ఇంతలో ఏమైందబ్బా? ఆశ్చర్యం వేస్తోందతడికి.

ఎప్పుడో అర్థగంట క్రితం మాధవి టేబుల్‌మీద పెట్టిన టిఫిన్ తిని, ఫ్లాస్క్‌లోని కాఫీ పోసుకుని తాగుతూ కూడా తన కణతల గట్టితనాన్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తూనే ఉన్నాడు. జేబులో పెట్టుకున్న పాత కళ్ళజోడుని మరొకసారి భద్రంగా చేతితో తడుముకున్నాడు.

బయలుదేరబోతూ తల దువ్వుకుందుకు అద్దం దగ్గరకి వెళ్లాడు. అద్దంలో తన ముఖం చూసుకున్న కేశవరావుకి నవ్వాలో ఏడవాలో తెలియలేదు. ఇంతదాకా కణత దగ్గర టకటకమున్న శబ్దానికి అర్థం తెలిసిందిప్పుడు. హతోస్మి!

ఒక ఫ్రేమ్‌కి ఇంకొక ఫ్రేమ్‌కి తగిలి వచ్చిన శబ్దమది.

**-ఆచంట హైమవతి (బెంగుళూరు)**